## క్లుప్తంగా

### నేడు వైఎస్సార్ సీపీ నేతల సమావేశం

దర్శి: స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. సమావేశానికి ఉమ్మడి ప్రకాశం జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలు హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీలో వివిధ పదవుల్లో ఉన్న నాయకులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్‌లు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### యూటీఎఫ్‌లో పదవులు



ప్రశంసాపత్రం అందుకుంటున్న రోశయ్య

దొనకొండ: మండలానికి చెందిన యూటీఎఫ్ శాఖలో చాలా రోజులుగా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్న టి.రాజశేఖర్, ఈ.రోశయ్యకు గోల్డెన్ జూబ్లీ వారోత్సవాల సందర్భంగా వారికి జిల్లాలో స్థానం కల్పించారు. టి.రాజశేఖర్ జిల్లా కార్యదర్శిగా, ఈ.రోశయ్య కుటుంబ సంక్షేమ పథకం డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా జిల్లా శాఖ ఎన్నుకుంది. వారు మాట్లాడుతూ తమ మీద నమ్మకంతో జిల్లా శాఖలో పదవులు ఇచ్చిన పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. తమ వంతు బాధ్యతలు తూచా తప్పకుండా ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

### చెంచు గిరిజనులకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న అశోక్‌కుమార్

పెద్దదోర్నాల: మండల పరిధిలోని బోడు గూడెంలోని చెంచు గిరిజనులకు నెల్లూరు జిల్లా ఆత్మకూరు పట్టణానికి చెందిన ఎడ్నమ్మ క్రిస్టియన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ తరపున పాస్టర్ అశోక్‌కుమార్ దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యనిర్వహకులు ఎడ్వర్డు పాల్గొన్నారు.

# బొప్పాయి పంటకు తెగుళ్లు

- ఉద్యాన శాఖాధికారి ఎక్కడ?


పుల్లలచెరువులో తెగులు సోకిన బొప్పాయి పంట

పుల్లలచెరువు:

మండలంలోని పలు గ్రామాల్లో వేసిన బొప్పాయి పంటకు తెగుళ్లు సోకి రైతులు పలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో 107 ఎకరాల్లో బొప్పాయి పంటను సాగు చేసినట్లు అధికారులే చెబుతున్నారు. రైతులు సాగు చేసిన బొప్పాయి పంటకు తెగుళ్లు సోకితే వాటి నివారణకు మందులు చెప్పే అధికారులు లేకపోవడంతో కేవలం రైతులు ఎరువుల దుకాణదారులపై ఆధారపడి మందులు, ఎరువులు వాడాల్సి వస్తోందని పుల్లలచెరువుకు చెందిన కొత్తా వెంకటేశ్వర్లు అనే రైతు వాపోతున్నాడు. కాపు వచ్చే సమయానికి తెగుళ్లు సోకితే భారీ మొత్తంలో నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యానశాఖాధికారి యర్రగొండపాలెంలో ఉంటున్నాడు.. ఆయన గారు ఎప్పుడు వస్తారో, రారో తెలియదు. కనీసం ఫోన్ చేసి సమస్యలు చెప్పుకుని మందులు అడుగుదాం.. అంటే కనీసం ఆయన ఫోన్ కూడా తీయడని రైతులు మండిపడుతున్నారు. ఒక వేళ ఫోన్ కలిసినా అడిగితే తాను చాలా మండలాలకు అధికారినని, ఎక్కడని తిరగాలనే సమాధానం చెబుతున్నాడని రైతులు పేర్కొంటున్నారు. పంట వేసుకుని నష్టపోయే కంటే వేయకుండా ఉండటమే మేలని రైతులు వాపోతున్నారు. అధికారులు ఉన్నా లాభం లేదని, కేవలం జీతాలకే పరిమితమవుతున్నారని, సమస్యలు గురించి పట్టించుకునే అధికారులు ఎక్కడని రైతులు ప్రశ్నిస్తున్నారు. పుల్లలచెరువు రైతులు జిల్లా అధికారికి ఫోన్ చేసి సమస్యలు చెప్పకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### మిర్చి పంటదీ అదే పరిస్థితి

మండలంలోని దాదాపు 7 వేల ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశారు. ఇటీవల కాలంలో వాతావరణంలో వచ్చిన మార్పులతో మిర్చి పంటకు బొబ్బర తెగులు సోకింది. దీంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కనీసం తెగుళ్లు సోకిన వాటిని ఏ రకం మందులు వాడాలి. వాటి నివారణకు చేపట్టవల్సిన చర్యల గురించి చెప్పేవారు లేకపోవడంతో రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉద్యాన శాఖాధికారి మండలంలో పర్యటించక పోవడంతో పంటలకు సోకిన తెగుళ్ల, తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పే వారు లేకపోవడంతో మండలంలోని పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.


తెగులు సోకిన మిర్చి పంట

**అధికారులు పట్టించుకోవడం లేదు:**



నేను బొప్పాయి పంటను నాలుగు ఎకరాల్లో సాగు చేశా. పంటకు తెగుళ్ల సోకడంతో వాటి నివారణకు మందులు, ఎరువులు ఎలా వాడాలోనని వై.పాలెం అధికారికి ఫోన్ చేస్తే కనీసం స్పందన లేదు. జిల్లా అధికారికి ఫోన్ చేసి సమస్యలు తెలిపా. అధికారులు రైతుల సమస్యలు పట్టించుకోకపోతే ఎలా. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రైతులకు ఉద్యాన అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

కొత్త వెంకటేశ్వర్లు, రైతు, పుల్లలచెరువు

## ఎంపీపీకి ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శ


ఎంపీపీ ఉషను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

దొనకొండ: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఎంపీపీ బొరిగొర్ల ఉషను ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మంగళవారం ఆమె స్వగ్రామం పడమర వెంకటాపురం వెళ్లి పరామర్శించారు. తానున్నానంటూ ఎంపీపీకి భరోసా ఇచ్చారు. ఆయన వెంట పార్టీ మండల మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ కర్నాటి ఆంజనేయరెడ్డి, ఎంపీటీసీ బండారు రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు తమ్మనేని సుబ్బారెడ్డి, ముప్పా రమణయ్య, కొంగలేటి మోషే, పెసల చిన్న నారాయణరెడ్డి, కె.ప్రసాద్ పాల్గొన్నారు.

## బూతు పురాణాలు ట్రోల్ చేయకండి

- సోషల్ మీడియా కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: సోషల్ మీడియాలో బూతు పురాణాలు ట్రోల్ చేయవద్దని, ఆ విధంగా చేస్తున్న అధికార పార్టీకి చెందిన పోస్టులను ప్రతి ఘటించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కొలుకుల రోడ్డులోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సోషల్ మీడియా సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సోషల్ మీడియా సభ్యుడు బాధ్యతగా వ్యవహరించాలని, ఇష్టపడి కష్టపడి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. నియోజకవర్గంలోని టీమ్ బాధ్యతగా, పద్ధతి ప్రకారం పోస్టులు చేస్తుండటం వల్లే 175నియోజకవర్గాల్లో తమ నియోజకవర్గంలో పనిచేస్తున్న ఒక్క సభ్యుడిపై కూడా కేసు నమోదు కాలేదన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానలపై వెనువెంటనే స్పందించి పోస్టుల ద్వారా ప్రశ్నిద్దామని, అందుకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. గతంలో కష్టపడినట్లే ఇప్పుడు కూడా కష్టపడి ప్రజల పక్షాన నిలబడాలన్నారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పటికి తేడాగా పోస్టులు పెట్టడం, మాట్లాడటం వంటివి చేయడం లేదని, అధికార పక్షానికి చెందినవారే అనవసరంగా వ్యవహరిస్తున్నారని, అందుకు దీటుగా సమాధానం చెప్పాల్సిన బాధ్యత తమపై ఉందని చెప్పారు. త్వరలో విడతలవారీగా సోషల్ మీడియా సభ్యులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో మిలాఖత్ చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

### యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా గోగుల

ముండ్లమూరు (దర్శి): యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా ఏకగ్రీవంగా రెండో సారి గోగుల కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ముండ్లమూరు మండల శాఖ సభ్యులు కోటేశ్వరరావుకు అభినందనలు తెలిపారు. ఒంగోలులో జరిగిన జిల్లా సర్వోత్సవాల్లో రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కొంజేటి సురేష్‌బాబు, గౌరవాధ్యక్షుడు కావూరి దేవరాజ్, జిలా కౌన్సిలర్ తిరుపతిరెడ్డి, ఫణిదం శ్రీనివాసరావు, బాచిన పూర్ణచంద్రరావు అభినందనలు తెలిపారు.



### వైభవంగా త్రిపురాంతకేశ్వరస్వామి ఉత్సవం


పార్వతి త్రిపురాంతకేశ్వరస్వామి ఉత్సవం

త్రిపురాంతకం: కార్తీక మాసం సందర్భంగా శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామి ఉత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. త్రిపురాంతకంలోని శ్రీత్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొంటున్నారు. స్వామి వారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు భక్తులచే పండితులు నిర్వహిస్తున్నారు. స్వామి అమ్మవార్ల ఆలయ ఉత్సవం మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా జరిగింది. ఉత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### హెచ్ఐవీ ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, హోండ్సప్ కంఫాసన్ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్ బెంజిమెన్ ఆధ్వర్యంలో మీకు తెలుసా కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు డైరెక్టర్ విజయకుమారి మాట్లాడుతూ హెచ్ఐవీ నాలుగు రకాలుగా వ్యాపిస్తుందన్నారు. సురక్షితం కాని లైంగిక సంబంధంతో కలుషితమైన సూదులు, సిరంజీల ద్వారా, కలుషితమైన రక్త మార్పిడి ద్వారా హెచ్ఐవీ సోకుతుందని తెలిపారు. హెచ్ఐవీ సోకిన తల్లి నుంచి బిడ్డకు వ్యాధి సంక్రమిస్తుందని, దీంతో పాటు ఎయిడ్స్ ఎలా వ్యాప్తి చెందదు అనే విషయంపై విద్యార్థులకు వివరించారు. 2017 యాక్టు ఏఆర్‌టీ మందుల గురించి, క్షయ వ్యాధుల గురించి పేర్కొన్నారు. ఈ వ్యాధికి చికిత్స లేదని, నివారణ ఒక్కటే మార్గమన్నారు. ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు, ఎయిడ్స్ సిబ్బంది రేణుకాదేవి, రాణి, భవాని పాల్గొన్నారు.

### శ్రీనివాసరెడ్డికి ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శ


శ్రీనివాసరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

త్రిపురాంతకం: వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ చినకొండు శ్రీనివాసరెడ్డి ఇటీవల ప్రమాదంలో గాయపడటంతో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పరామర్శించారు. మండలంలోని దువ్వలి గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి ప్రమాదవశాత్తు గాయపడి ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులపై శ్రీనివాసరెడ్డిని ఎమ్మెల్యే చంద్రశేఖర్ అడిగి తెలుసుకుని తగిన జాగ్రత్తలు తీసుకుని ధైర్యంగా ఉండాలన్నారు. ఈయన వెంట మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

# ఘనంగా రాజ్యాంగ దినోత్సవం


త్రిపురాంతకంలో ప్రతిజ్ఞ చేస్తున్న సీఐ, ఎస్ఐ


దొనకొండ: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


దర్శి: రాజ్యాంగానికి కట్టుబడే ఉంటామని ప్రమాణం చేస్తున్న ఎంపీపీ సుధారాణి


పుల్లలచెరువు: అంబేడ్కర్‌కు పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు


పెద్దదోర్నాల: రాజ్యాంగంపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు


దర్శి: మాట్లాడుతున్న ఏఆర్ఎస్ హెడ్ సంధ్యారాణి

దొనకొండ: మండల కేంద్రం దొనకొండలో ప్రజాప్రతినిధులు, అధికారులు 75వ భారతదేశ రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీడీఓ శ్రీదేవి, డిప్యూటీ తహసీల్దార్ నాగార్జునరెడ్డి, స్థానిక సర్పంచ్ కొంగలేటి గ్రేసీరత్నకుమారి దేవానంద్, పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణమూర్తి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక గౌతమి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రామయోగి సమక్షంలో అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26వ తేదీన రూపొందించారని, భారతదేశ ప్రజలమైన మనం సార్వభౌమ సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర్య రాజ్యం నిర్మించుకునేందుకు పౌరులందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం, ఆలోచన భావప్రకటన, విశ్వాసం, ధర్మంలోను, అవకాశాల్లోనూ సమానత్వాన్ని చేకూర్చడానికి వివిధ అంశాలపై రాజ్యాంగంలో పొందుపరిచినట్లు తెలిపారు. అనంతరం అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కళాశాల అడ్మిన్ నానీ, అధ్యాపకులు దేవదానం, వెంకటేశ్వరరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

**కురిచేడు (దొనకొండ):** జిల్లా గ్రంథాలయం కురిచేడులో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ పాలకురాలు ఎల్.సుమతి ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. మహిళా పోలీస్ బి.ప్రమీల, పంచాయతీ కార్యదర్శి అనూష, డిజిటల్ అసిస్టెంట్లు ఇందిర, బాజీ పాల్గొన్నారు.

**పుల్లలచెరువు:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కొనసాగించాలని హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, కేజీబీవీ ప్రిన్సిపాల్ లిల్లీప్రకాశ్‌వాణి అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ పాఠశాల, కేజీబీవీలో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించి రాజ్యాంగ దినోత్సవం జరిపారు. 2015 నుంచి ఏటా నవంబర్ 26వ తేదీన రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటామని చెప్పారు. ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగాన్ని తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు జానీబాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**త్రిపురాంతకం:** భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. పోలీస్‌స్టేషన్‌లో సీఐ అసాన్, ఎస్ఐ శివబసవరాజులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పోలీసులతో ప్రతిజ్ఞ చేయించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రభుత్వ వైద్యాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులు పూలమాల వేసి రాజ్యాంగం ఆవశ్యకతను వివరించి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. గ్రామ సచివాలయాల్లో, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో రాజ్యాంగ ఆమోద దినోత్సవం జరిగింది. సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో బాలవిహార్ స్కూల్లో చిన్నారులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

**తాళ్లూరు:** ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని గౌరవించాలని ఎంపీడీఓ సుందరరామయ్య సూచించారు. స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుందరరామయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగం సమాన హక్కులు కల్పించిందని చెప్పారు. ప్రతి ఒక్కరూ వాటిని దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. అంబేడ్కర్ దేశం కోసం చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. విద్యాశాఖాధికారి జి.సుబ్బయ్య, సర్పంచ్ చార్లెస్ సర్జన్, కె.సుజాత, పంచాయతీ కార్యదర్శి ఐవీ రమణారెడ్డి, పాల్గొన్నారు.

**దర్శి:** నియోజకవర్గంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. వ్యవసాయ పరిశోధనా స్థానంలో రాజ్యంగ ఆమోద దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ పి.సంధ్యారాణి మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత దేశానికి రాజ్యాంగం ఎంతో ఉపయోగకరమన్నారు. అందుకే ప్రజలందరికీ అవసరమైన సదుపాయాలన్నీ పొందుపరచారని చెప్పారు. లయోలా ప్రిన్సిపాల్ ఆంథోని, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ వరప్రసాద్‌రావు, లయోలా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపీపీ గోళ్లపాటి సుధారాణి అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని ప్రమాణం చేశారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎంపీడీఓ ఎల్.కృష్ణమూర్తి, ఈఓఆర్డీ ఆవుల సుధాకరరావు, సీడీఎస్ సీహెచ్ భారతి పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 75వ రాజ్యాంగా అమలు దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభుదాస్ రాజ్యాంగం గొప్పదనం గురించి వివరించారు. సీనియర్ అధ్యాపకులు డాక్టర్ కె.నరేష్, డాక్టర్ నగేష్, గంధం వేణు, రమేష్, హనుమంతరావు పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో రాజ్యంగ ఆమోద దినోత్సవంలో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, సంఘ సేవకులు జీవీ రత్నం మాట్లాడుతూ అన్నీ సామాజిక వర్గాలకు సమాన హక్కులు కల్పించి అందరి మానవ హక్కులను కాపాడిన మహానీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కొనియాడారు. ఎంపీపీ గోళ్లపాటి సుధారాణి, ఎంపీడీఓ కృష్ణమూర్తి, కవలికుంట్ల గోవింద్‌ప్రసాద్, గర్నెపూడి ప్రేమ్‌కుమార్, మిట్నాల బ్రహ్మయ్య, గంధం ఇర్మియా, కోటేశ్వరరావుపాల్గొన్నారు.

**పెద్దదోర్నాల:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సావిత్రి మాట్లాడుతూ 1949 నవంబర్ 26 తేదీన భారత రాజ్యాంగం ఆమోదించారని చెప్పారు. రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురించి విద్యార్థులకు తెలియజేశారు. అధ్యాపకులు డాక్టర్ విజయ బాబు, రమేష్, జయసింహా, అతిథి అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.